సాక్షి సూర్యాపేట

ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



పత్తి బేళ్లు మీద పడి మృతి
నాగారం మండలం ప్రగతినగర్‌లో పత్తిబేళ్లు మీదపడి కట్టి నాయక్‌రామ్(26) ఊపిరాడక మృతి చెందాడు. - 8లో



రూ.22లక్షలు చోరీ
గుర్తుతెలియని దుండగులు ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.22 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. - 8లో



భారీ అగ్నిప్రమాదం
ఆలేరు పట్టణంలోని మల్లికార్జున కాటన్ మిల్లులో జరిగిన అగ్నిప్రమాదంలో భారీ నష్టం వాటిల్లింది. - 8లో

న్యూస్‌రీల్

త్వరలోనే వికలాంగులకు రూ.6వేల పింఛన్

భానుపురి (సూర్యాపేట) : త్వరలోనే వికలాంగులకు రూ.6000 పింఛన్ అందుతుందని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పేర్కొన్నారు. శనివారం సూర్యాపేట పట్టణంలో ఆయనను వికలాంగుల సంక్షేమ సంఘాలు కలిసిన సందర్భంగా మాట్లాడారు. వికలాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వికలాంగులకు నెలవారి పెన్షన్ అందించడమే కాకుండా వికలాంగుల కార్పొరేషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో వికలాంగులకు 100 రోజుల పని దినాలు కల్పించిందని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వికలాంగుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముదిరేసి చెన్నయ్య

సూర్యాపేటటౌన్ : ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ముదిరేసి చెన్నయ్య కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ రిపోర్ట్ తెప్పించి తక్షణమే అమలు చేయాలని కోరారు. సమావేశంలో పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు అంకతి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి పులుసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు కొత్త బస్సులు మంజూరు

నల్లగొండ రూరల్: నల్లగొండ డిపోకు ఆరు కొత్త బస్సులు మంజూరైనట్లు ఆర్టీసీ ఆర్‌ఎం జానిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంజూరైన బస్సులను దేవరకొండ నుంచి మల్లేపల్లి, ముష్టిపల్లి, మర్రిగూడ, శివన్నగూడెం, చౌటుప్పల్, వలిగొండ నుంచి యాదగిరిగుట్టకు, మరో బస్ దేవరకొండ నుంచి మల్లేపల్లి, రేవల్లి, నాంపల్లి, మాల్ నుంచి హైదరాబాద్‌కు నడపనున్నట్లుపేర్కొన్నారు. అలాగే ఇంకో బస్సును దేవరకొండ నుంచి మల్లేపల్లి, ముష్టిపల్లి, నాంపల్లి, చండూరు మునుగోడు, కంచనపల్లి నుంచి నల్లగొండ వరకు, మరో రెండు బస్సులను నల్లగొండ నుంచి మునుగోడు, చొల్లేడు, చౌటుప్పల్, శివన్నగూడెం, మర్రిగూడ, మాల్, మరో బస్సును నల్లగొండ నుంచి మునుగోడు, వెల్మకన్నె, శివన్నగూడెం, లోయపల్లి, రంగాపూర్, ఇబ్రహీంపట్నం వరకు, ఆరో బస్సును నల్లగొండ నుంచి కనగల్, చండూరు, లెంకలపల్లి, మర్రిగూడ నుంచి మాల్‌కు నడపనున్నామని పేర్కొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- జిల్లా మొదటి అదనపు జడ్జి శ్యామ్ శ్రీ

చివ్వెంల(సూర్యాపేట) : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి మెగాలోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా మొదటి అదనపు జడ్జి శ్యామ్ శ్రీ పేర్కొన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా 3,048 కేసులు పరిష్కరించారు. విడిపోయిన భార్య, భర్తల రెండు జంటలకు కౌన్సిలింగ్ ఇచ్చి ఏకం చేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఫర్హాన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత , అదనపు జూనియర్ సివిల్ జడ్జి అపూర్వ రవళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.



విడిపోయిన దంపతులను కలుపుతున్న న్యాయమూర్తులు

రైతు చెంత.. భూమి ఎంత!

వ్యవసాయ గణన ముమ్మరం

- రైతులు, సామాజిక వర్గం, భూములు, పంటల వివరాల సేకరణ
- ఇప్పటికే మొదటిదశ పూర్తి
- రెండు, మూడు దశల గణనకు 18న ఎన్యుమరేట్లకు శిక్షణ
- నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తి చేసేలా కసరత్తు



భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో వ్యవసాయ గణనను అధికార యంత్రాంగం ముమ్మరం చేసింది. దేశంలో ఏ రకమైన రైతులు.. ఎంతమంది ఉన్నారు.. ఎవరికి ఎంత విస్తీర్ణంలో భూమి ఉందనే విషయాలు తెలుసుకోవడానికి భారత ప్రభుత్వం ప్రతి అయిదేళ్లకోసారి వ్యవసాయ గణన చేపడుతోంది. ఈ గణన రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి కావాల్సిన పథకాలను రూపొందించి అమలు చేసేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లాలో ఇప్పటికే మొదటి దశ గణన పూర్తయింది. రెండు, మూడో దశల వ్యవసాయ గణనకు సంబంధించి ఈనెల 18న ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెలాఖరు నాటికి గణన పూర్తి చేయాలని జిల్లా అధికారులు భావిస్తున్నారు.

మూడుదశల్లో..

వ్యవసాయ గణన కార్యక్రమం మూడు దశల్లో జరగనుంది. మొదటిది సామాజిక వర్గంగా, రెండోది సన్న, చిన్నకారు రైతుల విస్తీర్ణం పరంగా, మూడోది స్త్రీ, పురుషుల వారీగా గణన చేపట్టనున్నారు. దీంతో దేశంలోని ఏ రాష్ట్రంలో, ఏ జిల్లాలోని రైతులకు ఏ విధమైన అవసరాలు ఉన్నాయి..? ఏ విధమైన సౌకర్యాలు కల్పించాలి..? ఎలాంటి సంక్షేమ పథకాలు అందించాలనే నిర్ణయం కేంద్రం తీసుకోనుంది. మొదటి దశ గణనను పూర్తి చేశారు. జిల్లాలోని రెవెన్యూ గ్రామాల వారీగా సన్న, చిన్నకారు, మధ్య తరగతి, పెద్ద రైతుల వివరాలు, వారి సామాజిక వర్గం, వారికి ఉన్న భూముల వివరాలను సేకరించారు. ఇక రెండోదశలో జిల్లాలో 20 శాతం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి.. అక్కడ సన్న, చిన్నకారు, పెద్ద రైతుల భూముల్లో సాగు విస్తీర్ణం, సర్వే నంబర్ల వారీగా వివరాలు, ఆయా భూముల్లో ఏ రకమైన పంటలు పండించారు.? వాటికి ఏ రకమైన నీటి వసతులు ఉన్నాయి..? ఏ రకమైన పంటలు పండిస్తున్నారనే వివరాలు సేకరించనున్నారు. మూడోదశలో జిల్లాలోని 7శాతం రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి.. ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలకు ఉపయోగించిన వివిధ రకాల విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, పరికరాలు, వాటికి అవసరమైన వనరులను ఎక్కడి నుంచి సేకరించారనేది తెలుసుకోనున్నారు.

నెలాఖరు నాటికి పూర్తి

జిల్లాలో ఇప్పటికే మొదటి దశ వ్యవసాయ గణనను పూర్తి చేశాం. ప్రస్తుతం రెండు, మూడు దశల గణన చేసే సిబ్బందికి ఈనెల 18న కలెక్టరేట్‌లో శిక్షణ ఇస్తాం. అనంతరం ఈ నెలాఖరు నాటికి వ్యవసాయ గణన పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

–కిషన్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి

75మంది ఎన్యుమరేటర్లు, 23 మంది సూపర్‌వైజర్లకు..

జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో రెండు, మూడుదశల వ్యవసాయ గణన నిర్వహించేందుకు గాను ఈనెల 18వ తేదీన కలెక్టరేట్‌లో ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. 75 మంది ఎన్యుమరేటర్లు, 23 మంది సూపర్‌వైజర్లు ఈ శిక్షణకు హాజరు కానున్నారు. గతంలో నిర్వహించిన వ్యవసాయ గణన కార్యక్రమం పూర్తిగా మాన్యువల్‌గా చేపట్టారు. ప్రస్తుత గణనను మాత్రం పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. సెల్‌ఫోన్‌తోపాటు ట్యాబ్‌లో ఉండే యాప్ ద్వారా వ్యవసాయ గణన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. దీంతో నేరుగా సంబంధిత శాఖకు రైతుల వివరాలు వెళ్లనున్నాయి.

ఎత్తిపోతల పథకాల్లో పాత సిబ్బందినే కొనసాగిస్తాం

- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మునగాల: జిల్లా పరిధిలో సాగర్ ఎడమకాలువపై ఉన్న పలు ఎత్తిపోతల పథకాల్లో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న పాత సిబ్బందినే కొనసాగిస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌ను కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని ఎత్తిపోతల పథకాల చైర్మన్లు, సిబ్బంది కలిశారు. పాత సిబ్బందిని కొనసాగించాలని కోరారు. స్పందించిన మంత్రి .. అధికారులతో చర్చించి పాత సిబ్బందిలో ఐటీఐ పూర్తిచేసిన వారిని పంపు ఆపరేటర్లుగా ఇతరులను వాచ్‌మెన్, లస్కర్లుగా నియమించాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలకు జీవితాంతం రుణపడి ఉంటామని చైర్మన్లు, సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథకాల చైర్మన్లు శ్రీరాములు, లింగారెడ్డి,సోమేశ్వరరావు, అంతయ్య, రామిరెడ్డి, సిబ్బంది ప్రసాద్, పి.శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసరెడ్డి, అప్పారావు, కృష్ణయ్య, మహేష్, రాఘవేందర్‌రావు, విష్ణు, వెంకన్న, వెంకటేష్, చలపతి, శ్రీను, నారాయణ, వెంకట్ పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఎత్తిపోతల పథకాల చైర్మన్లు, సిబ్బందితో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం, ప్రత్యేకార్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామి,అమ్మవార్లను అందంగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణం తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ,తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు లక్ష్మీనరసింహమూర్తి, ఫణి భూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.



మట్టపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

గ్రూప్–2 పరీక్షలకు రెడీ

నేడు, రేపు పరీక్షలు

- సూర్యాపేటలో 30, కోదాడలో 19 కేంద్రాలు
- హాజరుకానున్న 16,857 మంది అభ్యర్థులు
- అరగంట ముందే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేత



సూర్యాపేట పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

సూర్యాపేటటౌన్ : గ్రూప్– 2 పరీక్షలకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఆది, సోమవారం జరగనున్న ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు రెండు పేపర్లు, రెండో రోజు మూడు, నాలుగు పేపర్ల పరీక్షలు జరగనున్నాయి. నిర్దేశించిన పరీక్షల సమయానికంటే అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల గేట్లు బంద్ చేయాలని, అభ్యర్థులు ఆ సమయంలోగా కేంద్రాల్లోకి వెళ్లాలని టీజీపీఎస్సీ సూచించింది. పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, అదనపు కలెక్టర్ల నేతృత్వంలో ఇప్పటికే పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించి సూచనలు చేశారు. విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి మార్గదర్శకాలు జారీచేశారు. టీజీపీఎస్సీ నిబంధనలు విధిగా పాటించాలని, అన్ని పరీక్ష కేంద్రాల్లోనూ మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆ దిశగా అధికారులంతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా విద్యుత్, తాగునీరు, వైద్య సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. శనివారం సూర్యాపేట పట్టణంలోని పలు సెంటర్లలో అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు వేశారు.

పరీక్ష రాయనున్న 16,857 మంది అభ్యర్థులు

కోదాడ రీజినల్ పరిధిలో 19, సూర్యాపేట రీజినల్‌లో 30 పరీక్ష కేంద్రాల్లో ఇలా మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 16,857 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ప్రతి 24 మంది అభ్యర్థులకు ఒక ఇన్విజిలేటర్, శాఖాపరమైన అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారు. పరీక్ష పత్రాలను బందోబస్తు నడుమ తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

గంటన్నర ముందు నుంచే..

ఉదయం పరీక్ష 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ పరీక్షకు అభ్యర్థులను ఉదయం 8:30 గంటల నుంచి 9:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఇక మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మరో పరీక్ష నిర్వహించనున్నారు.ఈ పరీక్షకు అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల నుంచి 2:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఆ తరువాత అరగంట సమయంలో బయోమెట్రిక్ హాజరు తీసుకుంటారు. ఈ కారణంగా అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాల గేట్లను బంద్ చేస్తారు. ఉదయం 9:30 గంటల తరువాత, మధ్యాహ్నం 2:30 గంటల తరువాత వచ్చే వారిని అనుమతించరు.

ఇవీ సూచనలు

- పరీక్ష కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం అభ్యర్థులు వ్యవహరించాల్సి ఉంటుంది. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదు.
- వాచ్‌లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలేవి తీసుకురావొద్దు.
- బూట్లు వేసుకొని రావొద్దు
- హాల్ టికెట్ మీద ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో విధిగా అతికించుకొని ప్రభుత్వం జారీచేసిన ఏదో ఒక గుర్తింపు కార్డు వెంట తీసుకొనిరావాలి.

నిర్దేశించిన సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

గ్రూప్ –2 పరీక్షలకు సంబంధించి కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్(144 సెక్షన్) అమలులో ఉంటుంది. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ , ఇంటర్‌నెట్ సెంటర్స్ మూసివేయాలి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రతి సెంటర్‌కు ఓ పోలీస్ సిబ్బందిని నియమించాం. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. నిర్దేశించిన సమయానికి ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసుకోవాలి.

– నాగేశ్వర్‌రావు, ఏఎస్పీ

- మేస్త్రీ కుటుంబం నుంచి మ్యూజిక్ డైరెక్టర్

కృషి, పట్టుదలే పదాలు..చరణాలు

సక్సెస్ స్టోరీ

పాటంటే అతనికి ప్రాణం.. చదువుకునే వయస్సు నుంచి పాటలే లోకంగా బతికాడు. సంగీతం నేర్చుకుని సినీ రంగం వైపు అడుగేశాడు. తొలి రోజుల్లో అవకాశాలు రాక ఇబ్బంది పడ్డాడు. సొంతంగా సినిమా తీసి నష్టపోయాడు. అయినా పోగొట్టుకున్న చోటే రాబట్టుకోవాలనే తలంపుతో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి వర్ధమాన సంగీత దర్శకుల సరసన చేరి రాణిస్తున్నాడు నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో మేళ్లదుప్పలపల్లికి చెందిన కొండేటి చరణ్ అర్జున్.

– రామగిరి(నల్లగొండ)



సంగీత దర్శకుడిగా రాణిస్తున్న నల్లగొండ జిల్లా మేళ్లదుప్పలపల్లి వాసి

- విమానం, లగ్గం సినిమాలతో బ్రేక్.. కేసీఆర్ సినిమాతో భారీ హిట్
- పాటల రచనలోనూ రాణిస్తున్న చరణ్ అర్జున్
- ఫౌండేషన్లు స్థాపించి కొత్తవారికి అవకాశాలు.. గ్రామానికి సేవ



పాటలు రికార్డింగ్ చేస్తున్న చరణ్ అర్జున్

నల్లగొండ మండలం మేళ్లదుప్పలపల్లికి చెందిన కొండేటి మల్లేశం, గోపమ్మ దంపతుల నలుగురు సంతానంలో చరణ్ అర్జున్ పెద్దవాడు. తండ్రి సుతారి మేస్త్రీ పని చేసేవాడు. చరణ్ అర్జున్ 1 నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామంలో, 8 నుంచి 10వ తరగతి వరకు నల్లగొండలో చదువుకున్నాడు. గట్టుప్పల్‌లో ఇంటర్ చదివి.. ఆ తర్వాత హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో మ్యూజిక్ కోర్సు పూర్తిచేశాడు. తన ప్రతి అడుగులో తన మేనబావ దండెం ప్రవీణ్ కుమార్ ఉంటారని చెబుతున్నారు చరణ్ అర్జున్.

చిన్ననాటి నుంచి సాధన..

తెరమీద నటనకు అనుగుణంగా తెర వెనుక సాగే సంగీతం వీనుల విందుగా ఉండాలి. అందుకు అనుగుణంగానే చరణ్ అర్జున్ చిన్నప్పటి నుంచి సాధన చేశాడు. పాటలంటే అభిమానం పెరిగి మ్యూజిక్ కోర్సులు పూర్తి చేశాడు. సినిమాల్లో వచ్చిన చిన్న చిన్న అవకాశాలు సద్వినియోగపర్చుకున్నాడు 2014లో సొంత ఖర్చులతో సినిమా తీశాడు. ఆ సినిమా ఆడకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. ఆ తర్వాత అవకాశం రాకపోవడంతో సోషల్ మీడియా వేదికగా స్వయంగా రాసిన, ట్యూన్ చేసిన పాటలను యూ ట్యూబ్‌లో పెట్టాడు. వాటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దాంతో చరణ్ అర్జున్ ప్రజల్లోకి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 50 వరకు పాటలను అప్‌లోడ్ చేశాడు.

కేసీఆర్ సినిమాకు మంచి బ్యాగ్రౌండ్ మ్యూజిక్

విమానం, లగ్గం సినిమాలకు అందించిన సంగీతంతో చరణ్ అర్జున్‌కు గుర్తింపు వచ్చింది. అంతకుముందు కూడా పలు సినిమాలకు పనిచేశాడు. పెద్ద హీరోలకు పాటలు రాసి ట్యూన్ అందించాడు. కానీ ఆయన పేరు ఎక్కడా తెర మీద కనిపించలేదు. ఇటీవల విడుదలైన కేసీఆర్ సినిమాకు చరణ్ అర్జున్ సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌కు మంచి పేరు వచ్చింది. మాజీ సీఎం కేసీఆర్‌కు ఏ పల్లె పిల్లోడో..., ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి మూడు రంగుల జెండా.. అనే పాటలు రాసి, సంగీతం అందించాడు.

ఫౌండేషన్ ద్వారా కొత్తవారికి అవకాశం




సీఎం రేవంత్‌రెడ్డితో చరణ్ అర్జున్

తనలాగా అవకాశాలు లేకుండా ఎవరూ బాధపడొద్దని చరణ్ అర్జున్ కల్చరల్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కళాకారులు కనకవ్వ, వల్లాల వాణక్క, నల్లగొండ గద్దర్, భిక్షమమ్మ, వీహా, మహతి, సంజయ్ మహేష్ లాంటి కొత్త వారిని పరిచయం చేశాడు. ప్రతిభ, నైపుణ్యం ఉన్న వారిని వెలికి తీయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అంతేకాకుండా ఊరికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇటీవల చరణ్ అర్జున్ (సీ) టీమ్‌ను ప్రారంభించాడు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, వ్యాపారస్తులు, వివిధ హోదాల్లో ఉన్న వారిని సమన్వయం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే అభిలాషతో ముందుకెళ్తున్నాడు.

చాలా సినిమాలకు అర్జున్ బాణీలు..

చరణ్ అర్జున్ వందేమాతరం శ్రీనివాస్, మణిశర్మ, యువన్ శంకర్ రాజా, సందీప్ చౌత, శంకర్ ఇసాన్ లాయ్ మ్యూజిక్ డైరెక్టర్ల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఎస్.శంకర్ దర్శకత్వం వహించిన ఆయుధం సినిమాలో 'ఇదేమిటమ్మా మాయ మాయ మైకం కమ్మిందా' అనే పాటకు చరణ్ అర్జున్ బాణీలు రాశాడు. నందమూరి కళ్యాణ్‌రామ్ మొదటి సినిమా అయిన తొలిచూపులోనే సినిమాకు ఒక పాట రాసి తానే ట్యూన్ చేశాడు. రామ్ చరణ్ నటించిన ఒక సినిమాకు కూడా పాటను రాసి ట్యూన్ అందించాడు. దాంతో మంచి పేరు వచ్చింది.



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో..

విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

హుజూర్‌నగర్ : విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. శనివారం హుజూర్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నూతన డైట్ మెనూను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు 40 శాతం, కాస్మొటిక్ చార్జీలు 200 శాతం పెంచిందన్నారు. రోజూ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి మెనూ అందించాలో నెలవారీ మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రూ. 300 కోట్లతో నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలో మూడు చోట్ల పాఠశాల ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. పదవ తరగతిలో 10కి10 మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందిస్తానని ప్రకటించారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం కష్టపడి చదివి అందుకనుగుణంగా ముందుకు సాగాలన్నారు. తొలుత విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. వారితో సెల్ఫీలు దిగి ఉత్సాహపరిచారు. అనంతరం గ్రూప్‌ఫొటో దిగారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహానా, తహసీల్దార్ మండడి నాగార్జునరెడ్డి, ఏడీఏ రవి నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, జూనియర్ లెక్చరర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

క్లుప్తంగా

అందుబాటులో 'జవహర్ నవోదయ' హాల్‌టికెట్లు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షా హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం శనివారం తెలిపారు. వచ్చేనెల 18న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 94489 83776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

వేములపల్లి: దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు చెందిన లావూరి శివ ఈనెల 12న వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వలో దూకడంతో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం శనివారం సూర్యాపేట జిల్లా పానుగోడు చెరువులో లభ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు షేక్ నజియా



చండూరు: ఇటీవల మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన 32వ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్‌లో బంగారుగడ్డ గ్రామానికి చెందిన షేక్ నజియా ద్వితీయ బహుమతి పొంది సిల్వర్ మెడల్ సాధించింది. ఫైనల్ చేరిన షేక్ నజియాను చండూరు ఫెన్సింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎండీ రహమత్ శనివారం స్థానికంగా అభినందించారు.

ఆదర్శ రైతులకు పుడమి పుత్ర అవార్డులు



మాట్లాడుతున్న పడమటి పావని

నల్లగొండ టూటౌన్: యాదగిరిగుట్టలో ఈనెల 22న నిర్వహించనున్న రైతు సదస్సులో ఆదర్శ రైతులకు పుడమి పుత్ర అవార్డులు అందించనున్నట్లు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, రైతు సదస్సు కన్వీనర్ పడమటి పావని తెలిపారు. శనివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. యాదగిరిగుట్టలోని రెడ్డి సంక్షేమ సంఘం భవన్‌లో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, 10 రాష్ట్రాల నుంచి 115 మంది సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు, సహకరిస్తున్న శాస్త్రవేత్తలకు, జర్నలిస్టులకు కిసాన్ సేవా రత్న అవార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మెరుగు మధు, రాష్ట్ర క్రీడా విభాగం కన్వీనర్ బొమ్మపాల గిరిబాబు, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు మాటూరి అశోక్, బాలరాజు, అనిత, అశోక్, అజీజ్, జ్యోతి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మొర ఆలకించండని.. మోకాళ్లపై దీక్ష



రెగ్యులరైజ్ చేయాలని శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చుని దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఏటీఎం పగులగొట్టి రూ.22లక్షలు చోరీ

- దామరచర్ల మండల కేంద్రంలో ఘటన

మిర్యాలగూడ: గుర్తుతెలియని దుండగులు ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.22,74,700 నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి వెంట ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నిర్వహణ సంస్థ శుక్రవారం రూ.16లక్షల నగదు నిల్వ ఉంచారు. అప్పటికే ఏటీఎంలో రూ.9లక్షలు ఉన్నాయి. మొత్తం రూ.25లక్షలకు గాను రూ.3లక్షల వరకు లావాదేవీలు జరిగాయి. శనివారం తెల్లవారు జామున 3.35గంటలకు దుండగులు ఏటీఎంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలను పగులగొట్టి ఏటీఎంపై స్ప్రే చల్లారు. తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం కింది భాగాన్ని కట్ చేసి రూ.22,74,700 నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎంను ధ్వంసం చేసిన సమయంలో అలారమ్ అలర్ట్‌తో ఏటీఎం నిర్వహణ సంస్థ అప్రమత్తమై వాడపల్లి పోలీసులకు ఉదయం 4.20 గంటలకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకునే లోగానే దుండగులు నగదుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఉదయం 6గంటలకు దామరచర్లకు చేరుకుని ఏటీఎం కేంద్రాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో పోల్చి చూశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. తెల్లకారులో కొంతమంది దుండగులు వచ్చి ఏటీఎం చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చోరీ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను, వ్యక్తులను విచారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్‌ఐ హరికృష్ణ ఉన్నారు.



ఏటీఎంను పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

పత్తి బేళ్లు మీద పడి మృతి



నాయక్‌రాం మృతదేహం

నాగారం: పత్తి బేళ్లు మీద పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నాగారం మండలంలోని ప్రగతినగర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఖండువా జిల్లా, పంథనా మండలం అర్థాల గ్రామానికి చెందిన కట్టె నాయక్‌రాం(26)కు భార్య కట్టె ప్రమీల బాయ్, రెండేళ్ల కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం నాగారం మండలానికి వచ్చాడు. ఈటూరు ఆవాసం ప్రగతినగర్‌లో ఉన్న శ్రీ శ్రీనివాస పత్తి మిల్లులో పని చేస్తున్నాడు. శుక్రవారం పత్తి మిల్లులో పనిచేసి రాత్రి భోజన సమయంలో భార్య ప్రమీలాబాయ్‌తో గొడవపడి తనకు కేటాయించిన గదిలో కాకుండా పత్తి మిల్లు ఆవరణలో ఉన్న పత్తి బేళ్లపై నిద్రించేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు పత్తి బేళ్లు కూలాయి. దీంతో నాయక్‌రాం పత్తిలో కూరుకపోయి ఊపిరాడక మృతి చెందాడు. తెల్లవారు జామున అతడి భార్య ప్రమీల బాయ్ తన భర్త కోసం వెతుకుతుండగా నాయక్‌రాం పత్తిలో కూరుకపోయి విగతజీవిగా కనిపించాడు. దీంతో ఆమె బోరున విలపిస్తూ తోటి కార్మికులకు, మిల్లు యాజమాన్యానికి విషయాన్ని తెలియజేసింది. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఐలయ్య అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కట్టె ప్రమీలబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు.

గుండెపోటుతో బాలుడు మృతి



హర్షిత్ (ఫైల్)

బొమ్మలరామారం: గుండె పోటుతో బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం బొమ్మలరామారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యావపూర్ తండాకు చెందిన దీరావత్ నర్సింహ– విజయ దంపతులకు హర్షిత్(08) కుమారుడు. రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు పాఠశాలకు సెలవు కావడంతో శుక్రవారం హర్షిత్ హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఆడుకుంటున్న హర్షిత్ తనకు నొప్పిగా ఉందని తన అమ్మమ్మకు తెలిపాడు. ఆస్పత్రికి తీసుకెళ్లడంతో చికిత్స అందించారు. గుండెపోటు రావడంతో శనివారం మృతి చెందాడు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రెండవ శనివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు భక్తులతో సందడిగా మారాయి. శ్రీస్వామిని భక్తులు అధికంగా దర్శించుకునేందుకు రావడంతో ధర్మ దర్శనానికి 3గంటల సమయం, వీఐపీ దర్శనానికి 1గంట సమయం పట్టింది. యాదగిరీశుడిని సుమారు 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.40,59,794 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఆలయ మాడ వీధిలో నెలకొన్న భక్తుల రద్దీ →



కేసుల పరిష్కారానికి రాజీ పద్ధతే మేలు

- నల్లగొండ జిల్లా ప్రధాన జడ్జి నాగరాజు
- జాతీయ లోక్‌అదాలత్‌లో 14,450 కేసులు పరిష్కారం



రాజీ పత్రం అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు, ఇతర జడ్జీలు

రామగిరి(నల్లగొండ): రాజీ పద్ధతిలో కేసులు పరిష్కరించుకుంటేనే ఇరువర్గాల కక్షిదారులకు మేలు జరుగుతుందని జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. శనివారం నల్లగొండలోని జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ తీర్పు అంతిమమని.. తిరిగి అప్పీల్‌కు అవకాశం ఉండదన్నారు. అనంతరం కక్షిదారులకు రాజీ పత్రాలు అందజేశారు. లోక్ అదాలత్‌లో సివిల్ 72, క్రిమినల్ 4,787, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 86, బ్యాంక్ కేసులు 9, సైబర్ క్రైం 15, ట్రాన్స్‌కో 230, ట్రాఫిక్ చలాన్ 9,251తో కలిపి మొత్తం 14,450 (పెండింగ్, ప్రిలిటిగేషన్) కేసులు పరిష్కరించారు. ఇందులో ప్రమాద బీమా రూ.4.93 కోట్లు, బ్యాంక్ రుణపరిహారం రూ.3.5లక్షలు, సైబర్ క్రైం కేసులో రికవరీ రూ.1,14,385 అందజేశారు. ఈ కార్యక్రమంలో 3వ అదనపు జిల్లా జడ్జి డి.దుర్గాప్రసాద్, 4వ అదనపు జిల్లా జడ్జి కె.కవిత, లీగల్ సెల్ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డీవీఆర్.తేజోకార్తీక్, ఇతర జడ్జీలు శిరీష, సౌందర్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీ సిరిగిరి వెంకట్‌రెడ్డి, జి.లింగయ్య గౌడ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ ఎన్.భీమార్జున్ రెడ్డి, ఎం.లెనిన్‌బాబు, టీవీ.ప్రసాద్, పి.బ్రహ్మచారి, పారాలీగల్ సెల్ వలంటీర్లు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి.. గొంతు కోసుకుని ఆత్మహత్య

- మృతుడు కేతేపల్లి వాసి



చిట్యాలలో వరప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

చిట్యాల: పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో జాతీయ రహదారికి సమీపంలో శనివారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పురుగుల మందుతాగి.. గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస వరప్రసాద్(59) గత కొనేళ్లుగా నల్లగొండలో కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వరప్రసాద్ ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత మూడు నెలలుగా విధులకు వెళ్లడం లేదు. చిట్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో ఇతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి చిట్యాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ ధర్మా సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పురుగుల మందు తాగడంతో పాటు అతడి గొంతు వద్ద లోతుగా తెగినట్లుగా గుర్తించారు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా, కత్తితో పాటు సెల్‌ఫోన్, అతను పనిచేస్తున్న సంస్థ ఐడెంటిటీ కార్డు పోలీసులకు లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర అప్పుల్లో కూరుకుపోవటంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్లు మృతుడి భార్య రుక్మిణి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

- దాదాపు 250 క్వింటాళ్ల పత్తి దగ్ధం



మల్లికార్జున కాటన్ మిల్లులో దగ్ధమవుతున్న పత్తి

ఆలేరురూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మల్లికార్జున కాటన్ మిల్లులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. రైతుల నుంచి మిల్లర్ కొనుగోలు చేసిన పత్తిని మిల్లు ఆవరణలో నిల్వ ఉంచారు. షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మిల్లులో మంటలు చెలరేగాయి. దీంతో మిల్లులో ఉన్న అధికారులు బయటికి పరుగులు తీశారు. ఈప్రమాదంలో సుమారు 250 క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా.. దాదాపు 18లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని ఆలేరు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చైతన్య, ఎస్‌ఐ రజీకర్, కాంగ్రెస్ నాయకులు పరిశీలించి కారణాలను అడిగి తెలుసుకున్నారు.

వరుసగా ఐదు కార్లు ఢీ



జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

నార్కట్‌పల్లి: హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వరుసగా ఐదు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. నార్కట్‌పల్లి మండల పరిధిలోని చల్లపట్నం హోటల్ సమీపంలో గల టీ పాయింట్ నుంచి కారు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చింది. దీంతో హైదరాబాద్ నుంచి నార్కట్‌పల్లి వైపు వెళ్తున్న కారు సడన్‌గా ఆపాడు. దీంతో దాని వెనకాలే మరో ఐదు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. దీంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. అయితే జాతీయ రహదారికి ఇరువైపులా చిన్నచిన్న హోటల్స్, టీపాయింట్‌లు ఏర్పాటు చేయడంతో రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు ఒకేసారి రోడ్డు మీదకు వస్తున్నాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

టాటాఏస్, టవేరా ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు సూర్యాపేట జిల్లావాసి



సంపత్ (ఫైల్)

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబాయి తండా సమీపంలో జనగామ–సూర్యాపేట రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ నుంచి సూర్యాపేట వైపునకు టాటాఏస్ ట్రాలీ వాహనం వెళ్తోంది. ట్రాలీలో మరిపెల్లి యాకయ్య(46), సూరపల్లి సంపత్(52) అనే ఇద్దరు ప్రయాణికులు నిల్చున్నారు. చింతబాయి తండా సమీపంలోకి రాగానే టాటా ఏఎస్‌ను ఎదురుగా వస్తున్న టవేరా ఢీకొట్టింది. వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. రెండు వాహనాల్లోని వారు బయటికి వచ్చే వీలులేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ఇరువాహనాల క్యాబిన్లలో ఇరుక్కున్న ఎనిమిది మందిని బయటకు తీశారు. అందరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగ్రాతుల్లో ఓ మహిళ పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలించారు. కాగా, రెండు వాహనాలను రోడ్డు పక్కకు తీసే క్రమంలో టాటాఏస్ వాహనం వెనుక చూడగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో ఒకరు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడేనికి చెందిన మరిపెల్లి యాకయ్య(46), మరొకరు సూర్యాపేట జిల్లా తిరుమలగిరికి చెందిన సూరపల్లి సంపత్(52)గా గుర్తించారు. పరిపెల్లి యాకయ్య జనగామ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షకు ఐదురోజుల నుంచి హాజరవుతున్నాడు. శనివారం కూడా హాజరై స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో టాటా ఏస్ ట్రాలీలో ప్రయాణించాడు. అలాగే, సంపత్ కూడా స్వగ్రామానికి వెళ్లేందుకు టాటా ఏస్ ట్రాలీలో ప్రయాణించాడు. యాకయ్య కుమారుడు బెనహర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

చిలుకూరులోనూ ఆ యువతి బాధితులు

- ఎస్‌ఐ ఆత్మహత్య కేసులో బానోతు అనసూర్య అరెస్టు
- గతంలో పలువురిపై ఫిర్యాదు చేసిన అనసూర్య

చిలుకూరు: ములుగు జిల్లా వాజేడు ఎస్‌ఐ రుద్రారపు హరీష్ ఆత్మహత్యకు కారణమైన యువతిని పోలీసులు అరెస్టు చేసిన ఆ యువతి స్వగ్రామైన చిలుకూరు మండలం దూదియాతండాలో ఈ విషయం చర్చనీయాంశమైంది. ఈ నెల 2న ఎస్‌ఐ హరీష్ ఆత్మహత్య చేసుకోగా.. ఆ ఘటనకు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూదియాతండాకు చెందిన బానోతు అనసూర్య కారణమని అప్పటి నుంచి మీడియాలో ప్రచారమైంది. ఎస్‌ఐ ఆత్మహత్యతో తనకు సంబంధం లేదని ఆమె పలు మీడియా ఛానల్స్‌లో ఇంటర్వ్యూలు కూడా ఇచ్చింది. అయితే, పోలీసులు ఆమెను పూర్తిస్థాయిలో విచారించి అరెస్టు చేశారు.

పలువురిపై కేసు

ఆ యువతి బాధితులు చిలుకూరులో కూడా ఉన్నట్లు తెలిసింది. విజయనగరానికి చెందిన శ్రీను అనే వ్యక్తి తనను ప్రేమించి మోసం చేశాడని ఆమె గతంలో చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇక్కడే కాకుండా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కూడా అతడిపై కేసు పెట్టింది. ఇటీవల చిలుకూరుకు చెందిన ఒక వ్యక్తి తనను మోసం చేశాడని కేసు పెట్టింది. ఆమె మీద కూడా కోదాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

తుంగతుర్తి: ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తి గ్రామానికి చెందిన తునం అంజయ్య (43) కొన్ని సంవత్సరాల క్రితం భార్యాపిల్లలతో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అతడికి ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో పాటు, కుటుంబ కలహాలు తోడు కావడంతో తన స్వగ్రామమైన గొట్టిపర్తి గ్రామానికి 4 రోజుల క్రితం వచ్చి తన కున్న వ్యవసాయ పొలాన్ని అమ్మకానికి పెట్టాడు. వ్యవసాయ పొలం కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

- తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తి ఆరోపణ
- ఆధారాలతో ఫిర్యాదు చేశానంటున్న బాధితుడు

నల్లగొండ క్రైం : తన భార్యతో నల్లగొండ పట్టణ టూటౌన్ సీఐ డానియల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తి ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. సదరు సీఐ తన భార్యతో కాపురం చేయనీయకుండా మనోవేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు విషయాన్ని బాధితుడు విలేకరులకు తెలిపాడు. వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన దంపతులు వారి సొంత ఇంటిని విక్రయించుకున్నారు. దానికి సంబంధించిన దస్తావేజులు తీసుకునేందుకు పట్టణంలో ఓ బ్యాంకు వెళ్లారు. ఆ తర్వాత భార్య పట్టణంలోని టూటౌన్ సీఐ వద్దకు వెళ్లి తనపై పలు ఆరోపణలతో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సీఐ డానియల్ ఆమెతో చనువు పెంచుకుని తన భార్యకు తరచూ ఫోన్, చాటింగ్ చేస్తూ.. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని బాధితుడు తెలిపాడు. తనను పదేపదే స్టేషన్‌కు పిలిపించి బెదిరించారని.. ఊళ్లో ఉన్న పొలం అమ్ముకుని వస్తే కేసులు తీసివేస్తామని, భార్యతో విడాకులు ఇప్పిస్తానని వేధించాడని పేర్కొన్నాడు. తన భార్యకు ప్లాటు కొనిస్తానని, డబ్బులు ఇస్తానని నమ్మబలికి లోబరుచుకున్నాడని ఆరోపించాడు. తన భార్య సెల్‌ఫోన్ తనిఖీ చేయగా సీఐతో చాటింగ్‌లు చేసిన విషయం తెలిసిందని.. ఈ చాటింగ్ తదితర ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు. తన భార్య, సీఐతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. కాగా.. ఈ ఘటనపై సీఐ డానియల్ స్పందిస్తూ తనపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని తెలిపారు. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా తనపై నిందలు వేస్తున్నారని పేర్కొన్నారు.

ఫిర్యాదుపై విచారణ చేస్తున్నాం

– ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సీఐపై వచ్చిన ఫిర్యాదుపై నల్లగొండ డీఎస్పీ విచారణ చేస్తున్నారని, ఫోన్ చాటింగ్ పరిశీలిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. డీఎస్పీ నివేదిక ఆధారంగా సీఐపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి



అవగాహన సదస్సులో విజయ్‌రామ్

నల్లగొండ: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు విజయ్‌రామ్ అన్నారు. ఆవు ఎరువుతో చేసే సహజ వ్యవసాయంపై శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఒక్క దేశవాళీ ఆవుతో 30 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే విధానాన్ని శిక్షణలో వివరిస్తామన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, హుస్సేన్‌బాబు, సురేష్‌గుప్త, రమేష్, గోనారెడ్డి పాల్గొన్నారు.